క్లుప్తంగా

ఘనంగా సీతారామ మందిర వార్షికోత్సవం



భట్టిప్రోలు (కొల్లూరు) : సీతారామ మందిర ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. అద్దేపల్లి కాపు సంఘం ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారు చెట్టు వద్ద నిర్వహించిన వేడుకలలో భాగంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. దీవి నాగ శేషాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన దేవతా మూర్తులను భక్తులు దర్శించుకొని పూజా కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. వేల్పూరి బాలసుబ్రమణ్యం, శ్రీనాగరాజా, వేల్పూరి నారాయణ రావు, మాధవి, వేల్పూరి పెద్దశ్రీనివాసరావు, పద్మ, వేల్పూరి నాగేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా గ్రామదేవతల పుట్టినరోజు వేడుకలు



కొల్లూరు : గ్రామ దేవతల పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం కొల్లూరు గ్రామ దేవతలైన చింతలమ్మ, అంకమ్మల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దక్షిణపు వీధిలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని దేవతామూర్తుల దర్శనం చేసుకొని ప్రత్యేక పూజల్లో పాలుపంచుకున్నారు. గ్రామ దేవతల పుట్టినరోజును పురస్కరించుకొని కొల్లూరు పార్వతీ అమ్మవారి ఆలయం నుంచి సంప్రదాయ బద్ధంగా గ్రామ దేవతలకు సారెను ఊరేగింపుగా తీసుకుని వెళ్లి భక్తులు సమర్పించారు.

ధర్మ నిధి సేకరణలో స్వచ్ఛంద సహకారం అవసరం



భట్టిప్రోలు (కొల్లూరు) : హిందూ ధర్మ రక్షణ కోసం సమరసత సేవా ఫౌండేషన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ధర్మనిధి సేకరణ కార్యక్రమానికి స్వచ్ఛంద సహకారం అవసరమని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. సోమవారం భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాలలో ధర్మ నిధి సేకరణ కార్యక్రమం మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టారు. హిందూ ధర్మ రక్షణ కోసం హిందువులందరూ సహకరించి నిధి సేకరణలో పాలు పంచుకోవాలని కోరారు. హిందూ ధర్మ రక్షణ కోసం సమరసత సేవా ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో చింతల మురళీకృష్ణ, వేల్పూరి మాధవి, పసుపులేటి సుభాషిణి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూమిని కేటాయించాలి



బాపట్ల: బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో బీసీ అగ్నికుల క్షత్రియ భవనం నిర్మించుకునేందుకు 10 సెంట్లు స్థలాన్ని కేటాయించాలని బీసీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులు వెంకటేశ్వరరావు కోరారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డిని సోమవారం కలిసిన సంఘ సభ్యులు వినతి పత్రం అందించారు. అగ్నికుల క్షత్రియులు సముద్ర వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న బడుగు బలహీన వర్గానికి చెందిన వారని, మీటింగులు, ఫంక్షన్లు తదితర అవసరాలకు భవనం నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పీత రామ్మోహన్ రావు, కొక్కిలగడ్డ చంద్రబాబు, కృష్ణంరాజు, బాలచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

చుండూరు(వేమూరు) : ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో టీడీపీ తరఫున ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను బలపర్చడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. చుండూరు మండల కేంద్రంలోని గురుకల పాఠశాల, వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపుకు ఉపాధ్యాయులందరు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మండలంలోని పిరాట్లంక గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ తెలిపిన వివరాల మేరకు పిరాట్లంక గ్రామంలో తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా బస్ షెల్టర్ వద్ద అదే గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి శ్రీనివాసరావు మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 2.16 లీటర్ల ఆఫీసర్ ఛాయిస్ మద్యం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు.

గీతల రాత మారేనా...?

- తరిగిపోతున్న తాటివనాలు
- అందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- పట్టించుకోని అధికారులు

బాపట్ల: కల్లు గీత కార్మికుల తలరాతలు మారడం లేదు. వీరి సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఏటా పన్ను వసూలు చేసుకుంటున్న అధికారులు వారి బాగోగులను పట్టించుకోవడం లేదు. కల్లు దిగుబడి నానాటికీ తరిగిపోవడం.. దీనిని తాగే వారి సంఖ్య తగ్గిపోవడంతో కార్మిక కుటుంబాలు పూట గడవని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. బాపట్ల ఎక్సైజ్ శాఖ కార్యాలయం పరిధిలో సుమారు 300కు పైగా గీత కార్మికులున్నారు. వీరిలో సగం మందికిపైగా ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు వస్తాయనే సంగతి కూడా తెలియదు. తరతరాలుగా కల్లు గీత వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వీరి జీవనం దుర్భరంగా మారింది. పోషణ కూడా భారమవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కనిపించని తాటివనాలు

ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతివ్వడంతో తాటి, ఈత కల్లు తాగే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీనికి తోడు కల్లు దిగుబడి ఆశించినంత లేకపోవడంతో పూట గడవని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. గతంలో పొలాల గట్ల వెంబడి, బీడు భూముల్లోనూ ఎక్కడబడితే అక్కడ తాటి తోపులు కనిపించేవి. ప్రస్తుతం తాటి వనాలు కూడా క్రమేణా అంతరించిపోవడం గీత కార్మికుల పాలిట శాపంగా మారింది. ఏళ్ల తరబడి కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న గీత కార్మికులు పనులు లేక రోడ్డున పడుతున్నారు. పల్లెల నుంచి నిత్యం వేలాది లీటర్ల కల్లు పట్టణాలకు ఎగుమతి చేసిన కార్మికులు ప్రస్తుతం తాగే వారు లేక గీసిన కల్లును పారబోస్తున్నారు. ధర పెంచుదామంటే కల్లు తాగే కొద్ది మంది కూడా దూరం అవుతారేమోనన్న బెంగ వారిని వెంటాడుతోంది.



కల్లు గీస్తున్న గీత కార్మికుడు

పెరిగిన అద్దెలు

ఒకప్పుడు పొలం గట్ల వెంబడి ఉన్న తాటి చెట్లకు కల్లు గీసేందుకు యజమానులు అద్దె తీసుకునే వారు కాదు. ప్రస్తుతం వీరి సంఖ్య తగ్గిపోవడంతో తమ చెట్టు నుంచి కల్లు గీసినందుకు సంవత్సరానికి ఒక్కో చెట్టుకు రూ.300 నుంచి 600 వరకు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు చెట్టు నుంచి వస్తున్న కల్లును పట్టుకునేందుకు వినియోగిస్తున్న లొట్టిలు (కుండలు) ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒక్కో కుండ ధర రూ.40 నుంచి 100 పలుకుతోంది. దీంతో కొత్తవి కొనలేక పాతవి పనికి రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆర్నెల్లే పని

కల్లు గీత కార్మికులకు కేవలం ఆర్నెల్లు మాత్రమే పని లభిస్తోంది. ఏటా నవంబర్ నుంచి జనవరి వరకు తాటి చెట్లను గీతకు సిద్ధం చేస్తారు. జనవరి నుంచి మే నెల వరకు చెట్ల నుంచి కల్లు దిగుబడి అవుతుంది. మిగిలిన రోజుల్లో ఇతర పనులు చేసుకోవాల్సిందే. దీంతో వారికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

పోషణ భారంగా మారింది

గతంలో తాటి వనాలు అధికంగా ఉండేవి. కల్లు అధికంగా లభించేది. గిట్టుబాటు లభించి కుటుంబ పోషణ సాధ్యపడేది. ప్రస్తుతం తాటి వనాలు నరికేస్తున్నారు. దీనికి తోడు కల్లు తాగే వారి సంఖ్య తగ్గిపోయింది. ప్రభుత్వ పథకాలు మాకేమి అందడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి సంక్షేమ పథకాలు అందజేయాల్సిన అవసరం ఉంది.

– కర్రి శ్రీనివాసరావు, పిన్నిబోయినవారిపాలెం

ప్రభుత్వం ఆదుకోవాలి

గీత కార్మికులను ప్రభుత్వం విస్మరించింది. దిగుబడి తగ్గిపోయి, వృత్తి కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికైనా దయతలచి గీత కార్మికులను ఆదుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో గీత కార్మికులకు అనుకూలమైన సంక్షేమ పథకాలను అందించాలి.

– మోహనరావు, ముత్తాయపాలెం

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె రూరల్: రానున్న వేసవిలో పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అరవపల్లి సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో పూర్తి స్థాయిలో నీటిని నింపే అవకాశం లేనందున ప్రతి సంవత్సరం వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. సమస్యను అధిగమించేందుకు పేటేరు రోడ్డులోని ఊర చెరువును అభివృద్ధి చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా వినియోగించనున్నామన్నారు. దీనిలో భాగంగా అమృత్ భారత్ పథకం కింద చెరువు అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరవ్వగా ప్రక్రియ టెండర్ల దశలో ఉందన్నారు. నిధులతో చెరువులో పూడికతీయటం, అభివృద్ధి చేయటం, కట్టలను బలపరచటంతో పాటు ఊర చెరువు నుంచి అరవపల్లి ఫిల్టర్ పాయింట్ వరకు పైపు లైన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చెరువు వద్దనే పంప్ హౌస్ ఏర్పాటు చేయబడునన్నారు. పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ల వద్ద వాల్వ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో నీటి వృధాను అరికట్టవచ్చన్నారు. వేసవిలోపు ఊర చెరువు పనులు పూర్తకాని పక్షంలో తాత్కాలిక చర్యలలో భాగంగా వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రూ.10 లక్షల బడ్జెట్ కేటాయించామన్నారు. కుళాయిల ద్వారా నీరు అందని వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయటంతో పాటు పట్టణంలోని అన్ని వార్డులలో చేతి పంపులు ఏర్పాటు, మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. పట్టణంలో పైపులైన్ల లీకేజీల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, 34 కిలోమీటర్ల మేర మెయిన్ పైపులైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

మహిళల రక్షణే సఖి వన్‌స్టాప్ సెంటర్ ధ్యేయం

ఎస్పీ తుషార్‌డూడీ



బాపట్లటౌన్: మహిళల రక్షణే సఖి వన్‌స్టాప్ సెంటర్ ధ్యేయమని ఎస్పీ తుషార్‌డూడీ అన్నారు. పట్టణంలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను సోమవారం ఎస్పీ తుషార్‌డూడీ పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ బాధిత మహిళలు టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేస్తే సఖి వన్ స్టాప్ సెంటర్ నుంచి సహాయం పొందవచ్చన్నారు. బాధిత మహిళల రక్షణ, వారి సమస్యల పరి ష్కారంకోసం సఖి సెంటర్ ఎల్లప్పుడు అందుబాటు లో ఉంటుందన్నారు. పోలీసు, వైద్య, న్యాయ, మహి ళా శిశు సంక్షేమ విభాగాల అధికారులు, సిబ్బందిని 'సఖి వన్ స్టాప్ సెంటర్'లో నియమించడం జరిగిందన్నారు. లైంగిక వేధింపులు, గృహ హింస, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, అక్రమ సంబంధాలు, ఈవ్ టీజింగ్, బెదిరింపులు, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలకు లోనై హింసించడం, పనిచేసే ప్రదేశంలో మహిళలపై వేధింపులు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం లాంటి ఫిర్యాదులపై మహిళలు 181కు కాల్ చెయ్యవచ్చన్నారు. ఫిర్యాదు తీవ్రతను బట్టి సోష ల్ కౌన్సిలర్, లీగల్ కౌన్సిలర్లు కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరం అయితే పోలీసుల సహాయం తీసుకోవడం జరుగుతుందన్నారు. అతివల సమస్యల సత్వర పరిష్కారానికి, రక్షణ కల్పించేందుకు 2024 సెప్టెంబర్‌లో బాపట్లలోని ఉప్పరపాలెం గేట్ సమీపంలో 'సఖి వన్ స్టాప్ సెంటర్' ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. బాపట్ల జిల్లాలో 'సఖి వన్ స్టాప్ సెంటర్' ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 32 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఉషారాణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించరాదు

తహసీల్దార్ షాకీర్ బాషా

నిజాంపట్నం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తిరునాళ్లలో నిర్వాహకులు కోడ్ ఉల్లంఘన చర్యలకు పాల్పడరాదని ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని గోకర్ణమఠం గ్రామంలో వేంచేసియున్న గంగా భ్రమరాంబ సమేత గోకర్ణేశ్వరస్వామి దేవాలయాన్ని సోమవారం మండల స్థాయి అధికారులతో కలసి పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలలో రాజకీయ నాయకుల చిత్రాలను ఎట్టి పరిస్థితుల్లో ముద్రించరాదన్నారు. తిరునాళ్లను పురస్కరించుకుని నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలలో అశ్లీలానికి తావివ్వరాదని, అశ్లీల నృత్యాలు ప్రదర్శించరాదన్నారు. నిబంధనలు ధిక్కరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తిరునాళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించబడునని, ఎవరైనా మద్యం తాగి తారసపడితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతిరావు, ఆలయ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయాన్ని పరిశీలించిన అధికారుల బృందం

చెత్త నుంచి సంపద తయారీ కోసం కృషి చేయాలి

డీపీఓ కె.ఎల్.ప్రభాకర్‌రావు



బాపట్ల: గ్రామంలోని ప్రజల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు, డ్రై వేస్టు అమ్మకాల ద్వారా పంచాయతీకి ఆదాయ వనరులు పెంచుకోవాలని బాపట్లజిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకరరావు చెప్పారు. సోమవారం ఈస్ట్ బాపట్ల పంచాయతీ నందిరాజు తోటలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను డీపీఓ తనిఖీ చేశారు. గ్రామంలో రోడ్ల పైన, బహిరంగ ప్రదేశాలలో చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. డీఎల్‌పీఓ కుమారస్వామి, ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.

సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ ఆదేశాలతో జరుగుతున్న సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారి అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా కార్యదర్శులందరూ తగిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను శుభ్ర పరచాలని అవసరం ఉన్న చోట కొళాయిలకు రిపేర్లు చేయించాలని కార్యదర్శులకు చెప్పారు. వీధిలైట్లు సక్రమంగా వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని పగలు లైట్లు వెలగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో తెలిపారు. ఇంటి పన్నుల వసూలు నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రజని, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

పురుగు మందు తాగి గొర్రెల కాపరి మృతి

చెరుకుపల్లి: గొర్రెలు మేపుకునేందుకు వచ్చిన యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై టి.అనీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా కోడూరు మండలం, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పరిశా భార్గవ్(26) గత కొద్ది రోజుల క్రితం గొర్రెలు మేపుకునేందుకు కనగాల గ్రామం వచ్చాడు. అయితే తనకున్న అప్పుల కారణంగా ఈ నెల 15వ తేదీ శనివారం కనగాల మద్యం దుకాణంలో మందు తీసుకొని అందులో పురుగు మందు కలుపుకొని తాగి అపస్మారక స్థితిలో పడిపోవటంతో అదే గ్రామంలో ఉన్న బంధువులు భార్గవ్‌ను చెరుకుపల్లి వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అయితే భార్గవ్ చికిత్స పొందుతూ ఆదివారం అక్కడే మృతి చెందాడని మృతుడి తండ్రి పరిశా బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి వివాహం జరిగి సంవత్సరం అయింది. అతడికి భార్య ఉంది.



చికిత్స పొందుతూ మృతి చెందిన భార్గవ్

విద్యార్థులకు ఆరోగ్య భారతిపై అవగాహన

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో 1972–73 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులకు స్వీట్ మెమరబుల్ బర్త్ డేట్ కరెన్సీ నోట్‌లను సోమవారం అందచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి నిర్వాహకులు బొలిశెట్టి సునీల్ కుమార్, ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. బీఎఫ్ఏ ఆధ్వర్యంలో ఆరోగ్య భారతి కార్యక్రమం విశ్వశాంతి పబ్లిక్ స్కూల్, టీఎంరావు హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థులకు ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం ఆరోగ్యంగా ఉంటే దేశం ఆరోగ్యంగా ఉంటుందనేది ఆర్యోక్తి అని అన్నారు. అలాగే ఓ వ్యక్తి చనిపోయిన 10 నిమిషాలలోపు సీపీఆర్‌ను చేస్తే రక్త ప్రసరణ మెదడు దాకా చేరి మరలా జీవించే అవకాశం ఉందని తెలిపారు. సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు చేసి చూపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫణి పార్థసారధి, పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరామ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో తిరునాళ్లను విజయవంతం చేయాలి

తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం అయ్యేలా పని చేయాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం వివిధ శాఖల అధికారులతో కలసి పర్యవేక్షించి అనంతరం మాట్లాడారు. తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. స్వామి వారిని దర్శించుకునే సమయంలో భక్తులు ఒత్తిడిని నియంత్రించేలా భారీ గేట్లను ఏర్పాటు చేయాలన్నారు. పొంగళ్లు పెట్టుకునే వారికి, తలనీలాలు సమర్పించే వారికి ప్రత్యేక స్థలాలు కేటాయించాలన్నారు. తిరునాళ్లలో భక్తులు ప్రభలను తీసుకువచ్చే సమయంలో రక్షణ సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగలు సంచరించే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఆవరణలో పారిశుద్ధ్య పరిరక్షణకు మున్సిపల్ అధికారులు సేవలు అందించాలని కోరారు. భక్తుల వాహనాలు నిలుపుకునేందుకు, ప్రసాదాలు పంపిణీ చేసే స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రత్యేక స్థలాలను కేటాయించాలన్నారు. వైద్యులు మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి సేవలను అందించాలని కోరారు. ఆలయం చుట్టూ పశువులు, ప్రభలతో ప్రదక్షిణ చేసే అవకాశం ఉన్నందున ఆలయానికి దూరంగా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శోభారాణి, ఆలయ పర్యవేక్షణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు, పశువైద్యాధికారి ప్రవీణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, ఎస్ఐ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించిన అధికారులు

రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలి

ఏవో రమేష్‌బాబు

నగరం: సొంత భూమి కలిగిన రైతులకు ఆధార్ కార్డ్ తరహాలో14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇస్తున్నట్లు వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు చెప్పారు. మండల కేంద్రమైన నగరంలో రైతులకు యూనిక్ ఐడీపై జరిగిన అవగాహన సదస్సులో ఏవో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేసేందుకు రైతులకు యూనిక్ ఐడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డ్, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. యూనిక్ ఐడీ నంబర్ ప్రభుత్వం ఇచ్చే పథకాలు రాయితీలు పంటల బీమా, రుణాలు వంటి సేవలకు ఉపయోగపడుతుందన్నారు. కావున రైతులు తప్పనిసరిగా ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో నాగశ్రీనివాసరావు, వీఏఏలు పాల్గొన్నారు.



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నిజాంపట్నం: దీర్ఘకాలికంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు తప్పవని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్లపట్ల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై.మేరీమణి హెచ్చరించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పల్లపట్ల ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో అనసూయకు సోమవారం వినతిపత్రం అందజేసి తమ డిమాండ్లు వివరించారు. వేతనాల పెంపుతో పాటు గ్రాడ్యుటీని పెంచాలన్నారు. సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులనే పదాన్ని తొలగించాలని, సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని కోరారు. ఐదు సంవత్సరాలోపు చిన్నారులందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విధంగా జీవో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లీశ్వరి, బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.



సీడీపీవో అనసూయకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

లక్ష్మణరావు వంటి సమర్ధుడిని మండలికి పంపాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

బాపట్ల: ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును గెలిపించటం ద్వారా శాసన మండలిలో సమర్థతకు పెద్దపీట వేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. సోమవారం పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు తరఫున బాపట్ల ఆర్ట్స్ కళాశాలలో పట్టభద్రులైన ఓటర్లను కలిసి పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ జిల్లా సీఐటీయూ నాయకులతో కలిసి రమాదేవి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నో ప్రజా సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి బలమైన ప్రజాతంత్ర ఉద్యమ కర్తగా ఉన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావును తిరిగి గెలిపించాలని కోరారు. బాపట్ల విద్యా కేంద్రంలో లక్ష్మణరావు వంటి సమర్థత కలిగిన నాయకుడిని గుర్తించాల్సిన అవసరం ఉందని రమాదేవి అన్నారు. ఉపాధ్యాయుల, పట్టభద్రుల కోసం బలమైన సంస్కరణలు అవసరమనే అభిప్రాయంతో ఎన్నో సందర్భాల్లో లక్ష్మణరావు శాసనమండలిలో తన గళాన్ని వినిపించారని పేర్కొన్నారు. నిజాయితీ గల నాయకుడు లక్ష్మణరావును గెలిపించుకోవలసిన బాధ్యత పట్టభద్రులపై ఉందన్నారు.

ప్రజావాణిని చట్టసభల్లో వినిపించేందుకు ప్రతి పట్టభద్రుడు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాల సభ్యులు పార్టీలకతీతంగా లక్షణరావు లాంటి మేధావికి ప్రథమ ప్రాధాన్యత ఓటు గెలిపించుకోవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంగయ్య, సీఐటీయూ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గళం విప్పగల వ్యక్తి లక్ష్మణరావు

చెరుకుపల్లి: పెద్దల సభలో పట్టభద్రుల సమస్యలపై నిజాయితీగా గళం విప్పగల మంచి వ్యక్తి కేఎస్ లక్ష్మణరావు అని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. గుంటూరు కృష్ణా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపును కాంక్షిస్తూ సోమవారం మండలంలోని చెరుకుపల్లి, గుళ్ళపల్లి గ్రామాల్లో ప్రజా సంఘ నాయకులతో కలసి కరపత్రాలు పట్టభద్రులకు పంపిణీ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు అన్ని ప్రజా సంఘాలు సంయుక్తంగా లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను రమాదేవి అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల యువతలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ నివాసానికి వెళ్లి లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యాలని రమాదేవి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు శరత్, ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ఈవూరు గణేష్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న రమాదేవి

గులియన్ బారే సిండ్రోమ్ గురించి భయపడనవసరం లేదు

ఎంపీడీఓ షేక్ మహబూబ్ సభాని

చెరుకుపల్లి: మండలంలోని ప్రజలు గులియన్ బారే సిండ్రోమ్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సభాని తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జీబీఎస్ వ్యాధి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ వ్యాధి అంటు వ్యాధి కాదని, జంతువులు, పక్షుల కళేబరాల వల్ల నీరు కలుషితమై వ్యాప్తి చెందుతుందన్నారు. కావున మండలంలోని ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహారం కూడా వేడిగా తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరూ గ్రామాల్లో నీటి ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేసిన తరువాతే తాగు నీటిని సరఫరా చెయ్యాలని, అదే విధంగా పారిశుద్ధ్యం ఎప్పటికప్పుడు మెరుగు పరచాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.